

ప్రథమ బహుమతికి ఎంపికైన ముగ్గు



ద్వితీయ బహుమతికి ఎంపికైన ముగ్గు



తృతీయ బహుమతికి ఎంపికైన ముగ్గు



ముగ్గును పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ముగ్గులు మెరిసె.. అవని మురిసె

- ఘనంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

అమీర్‌పేట జోన్ బృందం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో చుక్కలను నేలకు దించారు. భూమిపై రంగుల హరివిల్లులను తీర్చిదిద్దారు మహిళామణులు. ప్రతి యేటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు(పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆదివారం సనత్‌నగర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగాయి. ప్రముఖ నేత్ర వైద్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రవీందర్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. సంప్రదాయ ముగ్గులతోపాటు మహిళలు సామాజిక అంశాలను ఎంచుకొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.6 వేలు కృష్ణానగర్‌కు చెందిన టి.లావణ్య, ద్వితీయ బహుమతి రూ.4వేలు బేగంపేటకు చెందిన మాజీ బ్యాంక్ ఉద్యోగి మధురి నీమా, తృతీయ బహుమతి రూ.3వేలు బోరబండకు చెందిన పి.దివ్య గెలుచుకున్నారు. మిగతా పోటీదారులకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా భార్గవి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాధురీలత, కవిత విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మాధురి వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ప్రతి ఏటా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళాలోకంలో స్ఫూర్తి నింపడం అభినందనీయమని పేర్కొన్నారు. ముగ్గుల పోటీతో వారం ముందే సంక్రాంతి సందడి కనిపిస్తుందన్నారు. మహిళలు నేటి ప్రపంచంతో పోటీ పడుతూ తమలో దాగున్న సృజనాత్మక శక్తిని చాటి చెప్పాలన్నారు. కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం, భారతీయ, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఆకుల మహేష్ కుమార్, వంశీచంద్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి సబ్‌ఎడిటర్ కె.భాస్కర్, సిటీ స్టాఫ్ రిపోర్టర్ బాషా, డిజైనర్ నాగరాజు, జోన్ ఇన్‌చార్జి బల్లు సతీష్, విలేకరులు వెంకటేష్, భగవాన్, భిక్షపతి, లక్ష్మణ్‌యాదవ్, రమేష్, అర్జున్ పాల్గొన్నారు.

మూడేళ్లుగా పాల్గొంటున్నా..



మూడు సంవత్సరాలుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా. ఈసారి మొదటి బహుమతి పొందడం చాలా సంతోషంగా ఉంది. భర్త అటవీ శాఖలో పని చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి.

- టి.లావణ్య, ప్రథమ బహుమతి

ఐదుసార్లు పాల్గొన్నా..



సంక్రాంతి పండుగ వస్తుందంటే ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించే ముగ్గుల పోటీల కోసం ఎదురుచూస్తాను. ఇప్పటికి ఐదుసార్లు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నా. ఇద్దరు పిల్లలు. భర్త సాఫ్ట్‌వేర్. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి.

- మాధురి నిమా, ద్వితీయ బహుమతి

రెండుసార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు..



పది సంవత్సరాలుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా. రెండుసార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. భర్త డ్రైవర్. ఇద్దరు పిల్లలు.

- పి.దివ్య, తృతీయ బహుమతి



ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారితో న్యాయనిర్ణేతలు



కన్సోలేషన్ బహుమతి ఇస్తున్న న్యాయనిర్ణేతలు





ఏడుకొండల వెంకటేశ్వరుడి ముగ్గు వేస్తున్న యువతి







మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి





ముగ్గుల పోటీకి హాజరైన మహిళలు, యువత





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు

సైన్స్ అభివృద్ధికి జేవీవీ కృషి

పంజాగుట్ట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు, శాస్త్రీయ అవగాహన కోసం సైన్స్‌ని మరింత అభివృద్ధి చేసేందుకు జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) కృషి చేస్తుందని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్థిక సమస్య, పేదరికం, నమ్మకాలు ఇలా ఎన్నో సమస్యల మూలంగా మూఢనమ్మకాల వైపు ఆకర్షితులవుతున్న ప్రజలను వాటి నుంచి బయట పడేసేందుకు వేదిక ద్వారా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. జన విజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ జోన్ మహాసభ ఆదివారం వేదిక నాయకుడు ఎన్.పాపారావు అధ్యక్షతన వెంగళరావునగర్‌లోని బ్రహ్మం టాలెంట్ స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫలాలు సరిగ్గా సమాజానికి దక్కడం లేదని, అవి అందరికీ దక్కిన రోజే ఈ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకుడు నాగేశ్వరరావు, వేదిక నగర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. అనంతరం 15 మందితో జూబ్లీహిల్స్ జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బార్క్ రిటైర్డ్ సైంటిస్ట్ ఎస్.రవి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రవీంద్రబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయలు, విద్యావేత్తలు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

'లోతైన అధ్యయనంతో రచనలు చేయాలి'

బర్కత్‌పుర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రచయితలు నిరంతరం ప్రజల మధ్య ఉండి రచనలు చేయాలని ప్రముఖ రచయిత నిఖిలేశ్వర్ అన్నారు. పబ్లిసిటీ పురస్కారాల కోసం రచనలు చేయకుండా లోతైన అధ్యయనంతో రచనలు చేయాల్సిన అవసరం యువ రచయితలపై ఉందన్నారు. సామాజిక మానవ అనుబంధాలు, పోరాట పటిమ, శాస్త్రీయమైన సామాజిక అవగాహన, వ్యాసాలను విశ్లేషించే తపన తనను సాహిత్యపరంగా ముందుకు నడిపించాయని ఆయన పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో అంతర్‌వాణి శీర్షికన నిఖిలేశ్వర్ సాహిత్య, జీవన ప్రయాణంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన జీవితంలోని సాహిత్య అనుభవాలను విప్లవ కవిగా, హేతువాదిగా మార్చిన సంఘటనలను వివరించారు. ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ రచయిత నిఖిలేశ్వర్‌ను తనతో పాటు ఎందరో సాహితీప్రియులు ఆదర్శంగా తీసుకుని రచనలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అవకాశాలు, ఆధునిక విధానాలపై మత్స్యకారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పద్మశ్రీ, ప్రపంచ ప్రఖ్యాత మత్స్యరంగ నిపుణులు డాక్టర్ మోదడుగు విజయ్ గుప్తా అన్నారు. ఆదివారం తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఫిషరీస్ సొసైటీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజయ్ గుప్తా మాట్లాడుతూ.. చేపల ఉత్పాదకతలో ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా ఇక్కడి మత్స్యకారులకు శిక్షణ ఇస్తే, మత్స్య రంగంలో గణనీయమైన మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. సందర్భంగా జిల్లాల కన్వీనర్లను నియమించారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి

పంజాగుట్ట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెంగళరావునగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలవవచ్చని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ దేదేప్యరావు, పార్టీ నాయకులు విజయ్ ముదిరాజ్, రామకృష్ణ, శ్యామ్‌రావు, వెంకటమ్మ, డాక్టర్ అఫ్తాబ్, సుజాత, కుమారి, శ్రావణి, స్వరూప, బూత్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి

అన్ని పార్టీలు మాదిగలకు రెండు ఎంపీ స్థానాలు ఇవ్వాలి



సమావేశంలో పిడమర్తి రవి, మల్లికార్జున్ మాదిగ, తదితరులు

పంజాగుట్ట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు మాదిగ సామాజిక వర్గానికి రెండు ఎంపీ స్థానాలు ఇవ్వాలని, జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. తెలంగాణ దళిత బహుజన సమితి అధ్యక్షుడు గజ్జెల్లి మల్లికార్జున్ మాదిగ అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆవిర్భావ సమావేశం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, పెద్దపల్లి స్థానాలను తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమ నాయకులకు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అత్యధిక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర కమిటీని ప్రకటించి, వారికి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కె.రఘునాథ్, మేడ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా లింగాల కరుణాకర్, ప్రచార కమిటీ చైర్మన్ గా ఎం.కార్తీక్, గ్రేటర్ అధ్యక్షుడిగా వెంకటగిరి కిషోర్‌బాబు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా కె.భార్గవ్, తదితరులు నియమితులయ్యారు. సమావేశంలో మాదిగ రాజకీయ వేదిక చైర్మన్ వి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం : టీఆర్ఎస్

పంజాగుట్ట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కడం, సీఎం పీఠం ఎక్కడమే తమ ప్రధాన లక్ష్యమని తెలుగు రాజ్యాధికార సమితి(టీఆర్ఎస్) అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి జల్దీ అనిల్ కుమార్, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల్లోనూ, ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావుపూలే, కాన్షీరామ్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆలోచనలు, ఆశయాలతో పనిచేస్తూ ముందుకు వెళ్తామన్నారు. దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కనకస్వామి, డి.రవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు



శ్యాంరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, తదితరులు

మాజీ మేయర్ శ్యాంరావు విగ్రహావిష్కరణ

ఖైరతాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరానికి తొలి దళిత మేయర్‌గా సేవలందించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన మహానాయకుడు ఎం.శ్యాంరావు విగ్రహాన్ని వీర్‌నగర్ స్థానిక పంచాయతీ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ విగ్రహాన్ని ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంరావు వీర్‌నగర్‌లో జన్మించి నాలుగుసార్లు కార్పొరేటర్‌గా గెలిచి మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రిగా పనిచేశారని తెలిపారు. వీర్‌నగర్ ఎస్‌పీసీ భవన్‌కు ఆయన పేరు పెట్టడంతో పాటు విగ్రహాన్ని అందులో ఆవిష్కరించడం శుభపరిణామమని పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బి.పద్మారావు, ప్రధాన కార్యదర్శి జి.మోహన్‌రావు, శ్యాంరావు కుమారులు ఎంఎస్ ప్రకాష్‌రావు, శ్రీనివాస్‌రావు, పద్మారావు, కమిటీ ప్రతినిధులు రఘుపతి, కాంతికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సత్కారం

రవీంద్రభారతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరొందిన ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికవడం అభినందనీయమని వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో గోల్కొండ సాహితీ కళాసమితి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలుగు భాషా చైతన్య సమితి, లక్ష్య సాధన ఫౌండేషన్ సాంస్కృతిక, సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సన్మాన సభ నిర్వహించారు. నిర్వాహకులు డా.అర్ధచంద్రప్రకాశ్‌రెడ్డి, ప్రొఫెసర్ భాగయ్య, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, బొల్లాద్ రాఘవేంద్రాచార్యులు, పి.బడేసాబ్, ప్రజ్ఞారాజులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల నుంచి అత్యున్నతస్థాయికి ఎదిగిన తీరు ఆదర్శప్రాయమని అన్నారు. గడ్డం ప్రసాద్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి సన్మానించడం సంతోషమన్నారు.

వాహనాల అద్దాలు పగలగొట్టారని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన వాహనాల అద్దాలు పగలగొట్టారని బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెహ్మత్‌నగర్‌కు చెందిన సిహెచ్.రామకృష్ణ తన టెంపో వాహనాన్ని ఎప్పటిలాగే యూసుఫ్‌గూడ జానకమ్మతోటలో పార్కు చేశాడు. ఇతడితో పాటు మరో ఆరుగురు కూడా ఇక్కడ తమ టెంపో వాహనాలు పార్కు చేశారు. వీరు మరలా వచ్చి చూసేసరికి వాహనాల అద్దాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో బాధితులు అందరూ కలిసి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


బహుమతిని అందజేస్తున్న హిందూస్థాన్ యూని లీవర్ ప్రతినిధి ప్రసాద్, బంగారుమైసమ్మ ఆలయచైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్


కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్న ఆకాంక్ష క్యాటర్స్ అధినేత వేణుమాధవ్ తదితరులు


కన్సోలేషన్ బహుమతులను అందిస్తున్న విబ్బస్ ఫార్మా ఎండీ సుంకు రామచందర్ తదితరులు


ముగ్గులు వేస్తున్న యువతులు

చక్కగా.. చుక్కల ముగ్గులు




బీదల బస్తీలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ ద్వితీయ, తృతీయ విజేతలు దివ్య, హేమలత, వనజలు

సికింద్రాబాద్, బౌద్ధనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' కెనరాబ్యాంకు నిర్వహిస్తున్న ముత్యాలముగ్గుల పోటీలు... (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగళూరు, రియల్ పార్టనర్ : స్వర్గసీమ సుకేతన) ఆదివారం సీతాఫల్‌మండి టీఆర్‌టీ కాలనీ బీదలబస్తీ ప్లే గ్రౌండ్‌లో ఉత్సాహంగా జరిగాయి. సికిందాబాద్ నియోజకవర్గంతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగు, రంగుల చుక్కల ముగ్గులను చక్కగా వేశారు. ఈ ముగ్గుల పోటీలలో పాల్గొన్న మాదాపూర్ అయ్యప్ప సొసైటీకి చెందిన దివ్య మొదటి, బాలానగర్‌కు చెందిన హేమలత రెండవ, మైలార్‌గడ్డకు చెందిన వనజలు మూడవ బహుమతిని గెలుచుకున్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ నగదు బహుమతులను అందజేశారు. మరో బాలికకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రెండువేల రూపాయలను అందజేశారు. కాగా వారాసిగూడకు చెందిన స్వాతికి రెండు వేల రూపాయలను ఎయిమ్స్ ఇయర్ ఫోన్‌ను పద్మారావు గౌడ్ అందజేశారు. ఆకాంక్ష క్యాటర్స్ అధినేత, చాత్తాద వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వేణుమాధవ్, విబ్బస్ ఫార్మా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్‌లు మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందచేశారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది‌శైలజ, మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవీ, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు కరాటేరాజు, కందినారాయణ, కుంచాల ఏడుకొండలు, కనకట్ల హరి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, రవి ప్రసాద్‌గౌడ్ తదితరులు ముగ్గులను తిలకించారు. జడ్జీలుగా వ్యవహరించిన అరుణకుమారి (సైనిక్‌పురి), పిన్నమనేని (దాసరి), సంగీత (కూకట్‌పల్లి), దాసరి సునీత (మణికొండ)లకు పద్మారావుతోపాటు కార్పొరేటర్లు బహుమతులను అందజేశారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధులు దామోదర్, శ్రీధర్, మూర్తి రవికుమార్, ఉలుసు బ్రహ్మానందం, కందుకూరి సాగర్‌బాబు, నెమలికంటి జగదీష్, రాజయ్య, మురళి, శేషగిరిరావు, విష్ణు, రమణ, అంజయ్య, ఫొటోగ్రాఫర్ చిట్టిబాబు, సికింద్రాబాద్ అడ్వర్టయిజ్‌మెంట్ విభాగం ఇన్‌చార్జి అంజయ్యతోపాటు స్థానిక నేతలు విద్యాసాగర్, అంజనేయులు టీఆర్‌టీ శేఖర్, రాజేష్, సంజయ్, శైలేందర్, రవీంద్రసాగర్, మిట్టపల్లి బాబు రావు, అజీజ్, రమేష్‌గౌడ్, హెచ్‌యూజే అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు తమ ఆట, పాటలతో అందరినీ అలరించారు. ముగ్గుల పోటీలకు విచ్చేసిన కార్పొరేటర్లు, వివిధ పార్టీ నాయకులను ఆంధ్రజ్యోతి బృందం శాలువాలు కప్పి సత్కరించింది.

మహిళలకు, పిల్లలకు ఐస్‌క్రీమ్‌లు పంపిణీ

హిందూస్థాన్ యూని లీవర్ ఆధ్వర్యంలో బీదలబస్తీ గ్రౌండ్‌లో ముగ్గులు వేసే మహిళలకు, యువతులకు, బాలికలను క్వాలిటీ ఐస్‌క్రీమ్‌ను బంగారు మైసమ్మ ఆలయచైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, హెచ్‌యూఎల్ ప్రతినిధులు ప్రసాద్, సెంతిల్‌కుమార్, రమణమూర్తి, రాజుయాదవ్‌లు ఉచితంగా పంపిణీ చేశారు.


ముగ్గులను తిలకిస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు


ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ విజేతలతో పద్మారావు


సికింద్రాబాద్ సీతాఫల్‌మండి బీదలబస్తీ ప్లేగ్రౌండ్‌లో లోగో ముగ్గులు వేస్తున్న వారాసిగూడకు చెందిన స్వాతి, సైనిలు

ముగ్గుల పోటీల్లో ట్విన్స్

చిలకలగూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్ మండి, బీదల బస్తీలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న కృతి, కృషి ట్విన్స్ (కవలలు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాలుగారే బుగ్గలతో చిన్ని, చిన్ని చేతులతో వివిధ రకాల రంగులతో పోటీల్లో పాల్గొని తమ వంతు ప్రయత్నం చేశారు. కవలలు సీతాఫల్‌మండిలోని శ్రీసాయి విద్యాలయలో 6వ తరగతి చదువుతున్నారు. తండ్రి వినోద్ చారి బంగారు నగలు తయారు చేస్తుంటారు. తల్లి గతంలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్నానని జ్వరం వల్ల ఈసారి పాల్గొన లేకపోయానని తెలిపారు. ఈపోటీల్లో పాల్గొన్న కవలలను అందరూ పలకరించి ప్రోత్సహించారు.


కృతి, కృషి


కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

తప్పులు లేకుండా డేటా నమోదు చేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల్లోని డేటాను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం, మలక్‌పేట్ నియోజకవర్గానికి సంబంధించి ఆజంనగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదు కేంద్రాలను కలెక్టర్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల డేటా నమోదును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ సందర్భంగా ఆధార్, రేషన్ కార్డులు తప్పనిసరిగా నమోదయ్యేలా చూడాలన్నారు. అలాగే ప్రతి కాలమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిపై కేసు

బోయిన్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులపై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ పార్శిగుట్టలో నివాసం ఉంటున్న మహేష్ రెడ్డి, చక్రధర్, శ్రీనివాస్‌లు పనిమీద నిజామాబాద్‌కి వెళ్ళి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీలత గార్డెన్ మీదుగా ఏపి 01ఎన్ 5293 పిస్ట్ కారులో మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీలత గార్డెన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న బోయినపల్లి ట్రాఫిక్ ఎస్‌ఐ విజయకాంత్‌తో పాటు ఎనిమిది మంది సిబ్బంది వీరు నడిపిస్తున్న వాహనాన్ని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు సహకరించకపోవడంతోపాటు వారితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు చక్రధర్, మహేష్ రెడ్డి, శ్రీనివాసులును బోయిన్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వీరిని సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

బోయిన్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి భవిష్యత్ ఆ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. చదువుల తల్లి భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలె జయంతి ఉత్సవాలు బోయిన్‌పల్లిలోని జీవీఆర్ సీవీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఎస్‌సీ, ఎస్‌టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌సీ, ఎస్‌టీ సంఘాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రాలను సీతక్క అందజేశారు. ఈ క్రమంలో ఉత్తమ ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌సీ, ఎస్‌టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తున్న మంత్రి సీతక్క

నేడు శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి

30వ ఆరాధనోత్సవాలు

పద్మారావునగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్యస్వామి దేవాలయంలో సోమవారం కంచి కామకోటి 68వ పీఠాధిపతి, శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామివారి 30వ ఆరాధనోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఎల్వీ సుబ్రమణ్యం తెలియజేశారు. ఈమేరకు ఆదివారం పద్మారావునగర్‌లోని ఆలయ కార్యాలయంలో మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, కార్య నిర్వహణాధికారి చల్లా విశ్వనాధ శాస్త్రిలతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నడిచే దేవుడిగా ప్రసిద్ధి చెందిన చంద్రశేఖర సరస్వతి 1994 జనవరి 8 వ తేదీన శివైక్యం చెందారని ఆయన తెలిపారు. ఆరాధనోత్సవాలలో బాగంగా సోమవారం ఉదయం నుండి స్కందగిరి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయ శాఖలకు చెందిన వేద పండితుల సారధ్యంలో భవద్గీత, రామాయణ, ఉపనిషత్తులు, శ్లోకాల పారాయణం, సదాశివ బ్రహ్మేంద్ర కృతులు, పంచరత్న కృతులు, గురు కృతుల సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆలయం నుంచి వందలాది భక్తులతో కొత్తా కామకోటి కల్యాణ నిలయం వరకు మహా రథయాత్ర జరుగుతుందని, అనంతరం పండితులకు సన్మానాలు, సభ ఉంటుందన్నారు. ప్రస్తుత కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి అనుగ్రహ సందేశం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి డి.శ్రీధర్‌బాబు, కేరళకు చెందిన ఎడ్నీర్ మఠాధిపతి హాజరవుతారని తెలియజేశారు.


సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఎల్.వి.సుబ్రమణ్యం, కృష్ణన్ రాజమణి తదితరులు

బంజారా పార్క్‌లో ఉమెన్స్ మేళా ప్రారంభం

తిరుమలగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతకు కృషి చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుమలగిరి బంజారా కాలనీ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఉమెన్స్ మేళాను ప్రారంభించారు. ఉమెన్స్ మేళా ఆర్గనైజర్‌లు యశోద, ప్రతిభ, రీతు, రచనలు మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మేళాలో సుమారు 25 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బంజారా కాలనీ కమిటీ ప్రెసిడెంట్ అస్లం, సెక్రటరీ వైవి.రావు, ట్రెజరర్ ఆంథోని పాల్గొన్నారు.


ఉమెన్స్ మేళా ప్రారంభిస్తున్న మాజీ బోర్డు సభ్యురాలు భాగ్యశ్రీ


సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో రంగవల్లి చుక్కల ముగ్గుల పోటీలో విజేతలు

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజ పురోగతి

హైటెక్స్‌లో ఆలిండియా గైనకాలజీ సదస్సు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం పురోగతి సాధిస్తుందని ఎఫ్‌ఐజీఓ కోశాధికారి ప్రసూతి, గైనకాలజీ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ (ఏఐసీఓజీ) ఆర్గనైజింగ్ చైర్ పర్సన్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.శాంతకుమారి అన్నారు. హెచ్ఐసీసీలో గురువారం 66వ ప్రసూతి, ప్రసూతి సేవల సదస్సును డీపీ అధ్యక్షుడు డాక్టర్ హృషికేశ్, ప్రెసిడెంట్ డాక్టర్ జయదీప్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించడానికి ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తున్నామని తెలిపారు. దేశంలో తెలంగాణలోనే అతి తక్కువ మాతా శిశు మరణాల రేటు ఉందన్నారు. మహిళలపై హింసను నిరోధించేందుకు, మహిళల్లో చైతన్యం కలిగించేందుకు రెండు గంటల ఆన్‌లైన్ కోర్సును ప్రారంభించామన్నారు. త్వరలో జరిగే ఆఫ్‌లైన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు 6 వేల మంది గైనకాలజిస్టులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సదస్సులో డాక్టర్ మాధురీ పటేల్, డాక్టర్ అల్కా పాండే, డాక్టర్ ఆషా బాక్సీ డాక్టర్ గీతేంద్ర శర్మ, డాక్టర్ సంపత్‌కుమారి, డాక్టర్ యశోదర ప్రదీప్, డాక్టర్ సువర్ణ, ఖాదికర్, డాక్టర్ మనీషా తఖ్తానీ, డాక్టర్ పరీక్షిత్ ట్యాంక్, డాక్టర్ నిరంజన్ చవాన్, డాక్టర్ టీ. వింధ్య, బీ. అరుణ సుమన్, దేశ, విదేశాల నుంచి దాదాపు 12 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అవకాశాలు, ఆధునిక విధానాలపై మత్స్యకారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పద్మశ్రీ, ప్రపంచ ప్రఖ్యాత మత్స్యరంగ నిపుణులు డాక్టర్ మోదడుగు విజయ్ గుప్తా అన్నారు. ఆదివారం తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఫిషరీస్ సొసైటీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజయ్ గుప్తా మాట్లాడుతూ.. చేపల ఉత్పాదకతలో ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా ఇక్కడి మత్స్యకారులకు శిక్షణ ఇస్తే, మత్స్య రంగంలో గణనీయమైన మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. సందర్భంగా జిల్లాల కన్వీనర్లను నియమించారు.


సొసైటీ జిల్లా కన్వీనర్లతో డాక్టర్ విజయ్ గుప్తా, పిట్టల రవీందర్

'రామ మందిరం మన స్ఫూర్తి కేంద్రం'


అయోధ్య అక్షింతలు భక్తులకు అందజేస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జే.రామకృష్ణ


అయోధ్య శ్రీరాముల అక్షింతలు అడ్డగుట్ట, తుకారాంగేట్‌లో గడప గడపకు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు

మారేడ్ పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య రామమందిరం దేశ ప్రజల స్ఫూర్తి కేంద్రమని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామకృష్ణ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ పరిధిలోని వార్డ్ 5 వాసవి నగర్‌లో అయోధ్య శ్రీరామాలయం నుండి వచ్చిన అక్షింతలను తలపై ఎత్తుకొని బాజా బజంత్రీల నడుమ రామ కీర్తనతో శోభాయాత్ర నిర్వహిస్తూ ఇంటింటికీ వితరణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బోర్డు మెంబర్ రామకృష్ణ మాట్లాడుతూ 5 వందల ఏళ్ళ పోరాటం తర్వాత ప్రతీ హిందువు కల నిజమైన వేళ 22 జనవరి 2024న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, భవ్య రామ మందిరం ప్రారంభోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరికీ శ్రీ రాముని ఆశీస్సులు ఉండాలని రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు అయోధ్యలో పూజించిన అక్షింతలను, రామ మందిర చిత్రపటాన్ని, ఆహ్వాన పత్రికను ప్రతీ ఇంటికి చేరాలని గొప్ప సంకల్పంతో ఈ అక్షింతల వితరణ కార్యక్రమం చేపడుతున్నారని, ఈ బృహత్ కార్యంలో పాలుపంచుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవినగర్ కాలనీ వాసులు, హిందూ సంఘాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట : ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య శ్రీరాముల అక్షింతలు అడ్డగుట్ట, తుకారాంగేట్‌లో గడప గడపకు అందజేశారు. అంతకుముందు కొడారపు అశోక్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, మాజీ అధ్యక్షులు కందుకూరి గణేష్‌రావు, నాగబండి సుధాకర్, ఎల్లంకి వీరేశం, కాసుల లక్ష్మణ్‌గుప్త, నేతి నరేష్, బాలకృష్ణ, నూకల నర్సింగ్‌రావు, అమరాపెంటయ్య, మహంకాళి లక్ష్మీనారాయణ, కొడారపు అశోక్, కొడారపు శ్రీనివాస్, కొడారపు శివకుమార్, ఆకుల శ్రీనివాస్, గుడాల రాధాకృష్ణ ఊరేగింపులో పాల్గొన్నారు.